




# కరపత్రం

SINCE 2014

సోమవారం జనవరి 20 2025 | సంపుటి :0 | సంచిక : 99 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## ఆదిలాబాద్ జిల్లాలో ప్రమాదం.. 47 మంది యాత్రికులకు గాయాలు



ఎదులాపురం: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మాలేపూర్ ఘాట్‌లో యాత్రికులు ప్రయాణిస్తున్న వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 47 మంది యాత్రికులకు గాయాలయ్యాయి. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108, ప్రైవేటు వాహనాల్లో వాహనాల్లో రిమ్స్, నార్నూర్, ఉట్నూర్ ఆసుపత్రులకు తరలించారు. భక్తులు కెరమెరి మండలంలోని జంగుబాయి ఆలయానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో వాహనంలో మొత్తం 60 మంది భక్తులు ఉన్నారు. వీరిని గుడిహత్నూర్ మండలం సూర్యగూడ గ్రామ ఆదివాసీలుగా గుర్తించారు.

# హైదరాబాద్‌లో క్యాపిటల్ ల్యాండ్ రూ.450 కోట్ల పెట్టుబడి



సింగపూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ పర్యటన కొనసాగుతోంది. తాజాగా క్యాపిటల్ ల్యాండ్ ప్రతినిధులతో భేటీ అయ్యింది. హైదరాబాద్‌లో రూ.450 కోట్ల పెట్టుబడికి ఆ సంస్థ ముందుకొచ్చింది. నగరంలో లక్ష చదరపు అడుగుల మేర భారీ ఐటీ పార్కు నిర్మించనుంది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులతో సీఎం బృందం ఎంవోయూ కుదుర్చుకుంది.

తెలంగాణలో రూ.3,500 కోట్ల పెట్టుబడులకు ఎస్టీ టెలీమీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల సమీపంలోని మీర్‌ఖాన్‌పేటలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ క్యాంపస్‌ను స్థాపించేందుకు ఈ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది.

## నేటి అర్ధరాత్రితో వైకుంఠద్వార దర్శనాలు సమాప్తం

### శ్రీవారి ఆలయం ఎదుట నూతన అలంకరణలు

తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈనెల 10న ప్రారంభమైన వైకుంఠ ద్వార దర్శనాలు ఆదివారం రాత్రి ఏకాంత సేవతో శాస్త్రోక్తంగా ముగియనున్నాయి. పది రోజులపాటు ఉత్తర ద్వార దర్శన భాగ్యాన్ని కల్పిస్తూ 6.82 లక్షల మంది భక్తులకు ఉచిత సర్వదర్శన టోకెన్లను తితిదే జారీచేసింది. శుక్రవారం 61,142 మంది భక్తులు దర్శించుకోగా.. హుండీ కానుకలు రూ.3.15 కోట్లు లభించాయి. శనివారం సాయంత్రానికి సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులతో వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్టుమెంట్లన్నీ నిండిపోయి నారాయణగిరి షెడ్లలో భక్తులు వేచి ఉన్నారు.




### రైతు సోదరులారా దయచేసి ఆత్మహత్యలు చేసుకోకండి..

# హరీశ్‌రావు విజ్ఞప్తి

»ఆదిలాబాద్ జిల్లాలో 24 గంటలు గడవకముందే రుణభారంతో మరో రైతు రాథోడ్ గోకుల్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు.

»రుణమాఫీ పూర్తి చేశామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బ్యాంకుల వేధింపులతో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల చావులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

»దేశానికి అన్నం పెట్టే రైతన్న ఉసురు ఎందుకు తీస్తున్నారని నిలదీశారు.




వివరాలు 2 లో..


రైతుల ఆత్మహత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. రైతులకు భరోసా కల్పించడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని తెలిపారు. వరుసగా జరుగుతున్న రైతుల ఆత్మహత్యలే దానికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతులు దేశానికి వెన్నెముక అని.. అలాంటి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఇప్పటి వరకు మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఇంత జరుగుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టాడని హరీశ్‌రావు విమర్శించారు.

## పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నాం.. కానీ..: ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్: పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నామని.. కానీ ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును వ్యతిరేకిస్తున్నట్లు భారాస ఎమ్మెల్సీ కవిత తెలిపారు. నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. "పసుపు బోర్డు ఏర్పాటుపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదు? రాజకీయం కోసమే దీన్ని ప్రకటించారు.


2 లో


## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు..



లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై గువాహటి పోలీస్ స్టేషనలో కేసు నమోదైంది.

దేశంతోనూ కాంగ్రెస్ పోరాడుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై అస్సాంలోని గువాహటి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. మోన్‌జిత్ చాటియా అనే వ్యక్తి ఈ ఫిర్యాదు చేశారు.


2 లో


## కుంభమేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక: ప్రధాని మోదీ



మన్‌కీ బాత్ 118వ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.


2 లో


ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిందన్నారు. ప్రపంచ దేశాల ప్రజలు ప్రయాగ్‌రాజ్‌కు వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారని తెలిపారు.

# మల్లన్న దర్శనం పులకించిన భక్తజనం

గజ్జెల లాగులు..ఢమరుక నాదాలు..డోలు చప్పులు..అర్చకుల పూజలు..ఒగ్గు పూజారుల పట్నాలు..పోతురాజుల విన్యాసాలు, మహిళల బోనాల సమర్పణలతో మల్లన్న క్షేత్రం పులకించిపోయింది. స్వామి వారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు(%ణవజశీవవం%) చేసిన ఓం శ్రీ మల్లికార్జున స్వామియే నమహా నామస్మరణలతో మల్లన్న క్షేత్రం పరవశించింది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి క్షేత్రానికి పట్నం వారం సందర్భంగా 50వేల మంది భక్తులు తరలివచ్చారు. కొమురవెల్లి మల్లన్న ఉత్సవాలు పట్నం వారంతో వైభవంగా ప్రారంభమయ్యాయి.

బ్రహ్మోత్సవాలలో మొదటి వారం పట్నంవారంగా పిలువడం ఆనవాయితీ,ఈ క్రమంలో పట్నం(హైదరాబాద్)కు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని, పెద్దపట్నం వేసి అగ్నిగుండం దాటుతారు దీంతో మొదటి వారాన్ని పట్నం వారంగా పిలుస్తున్నారు. పట్నం వారం సందర్భంగా మల్లన్నను మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తన బంధువులు, స్నేహితులతో కలిసి దర్శించుకున్నారు.



రైతు సోదరులారా దయచేసి ఆత్మహత్యలు చేసుకోకండి..

# సంపాదకీయం

## రేవంత్ 'ఫార్ములా' ఏమిటో..!?

ఫార్ములా-ఈ రేసు కంపెనీ కేసులో ఏమి జరగబోతోంది? మాజీ మంత్రి కేటీఆర్ ఈ కేసులో ఇరుక్కున్నారా? ఆయనను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అరెస్టు చేస్తుందా? చేస్తే ఎప్పుడు? ఇదే కేసులో మరో నిందితుడిగా ఉన్న హెచ్ఎండీఏ మాజీ కమిషనర్ అర్వింద్ కుమార్ అప్రూవర్‌గా మారబోతున్నారా? తెలంగాణలో గత కొన్ని వారాలుగా ఈ ప్రశ్నలు చక్కర్లు కొడుతున్నాయి. కేటీఆర్‌ను ఇప్పుడు అరెస్టు చేస్తారు.. అప్పుడు అరెస్టు చేస్తారు అని మీడియాలో ఊహాగానాలు చేస్తున్నారు. అయితే కేసు మాత్రం జీడి పాకంలా సాగుతోంది. ఫార్ములా%-%ఈ వ్యవహారంలో కేటీఆర్ అడ్డంగా బుక్కయ్యారని ప్రభుత్వ వర్గాలు చెబుతుండగా, అసలు అవినీతే జరగనప్పుడు కేసు ఎక్కడ ఉంది? అని కేటీఆర్ ఎదురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఎంత బలంగా తన వాదన వినిపిస్తున్నదో.. కేటీఆర్ కూడా అంతే బలంగా తన వాదన వినిపిస్తున్నారు. దీంతో అసలు ఇందులో కేసు ఉందా? ఉంటే కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదు? అన్న అనుమానాలు ఏర్పడుతున్నాయి. ఫార్ములా%-%ఈ వ్యవహారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలగా ఉన్నారు. ఈ వ్యవహారంలో కేటీఆర్‌పై కేసు కట్టి విచారణ చేయడానికి అనుమతి ఇవ్వవలసిందిగా గవర్నర్ జిష్ణుదేవ్‌కు ప్రభుత్వం ఫైల్ పంపింది. ప్రభుత్వం అడిగింది కదా అని గవర్నర్ వెంటనే అనుమతి ఇవ్వలేదు. మొత్తం ఫైల్‌ను కేంద్ర ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు పంపి అభిప్రాయం చెప్పవలసిందిగా గవర్నర్ కోరారు. తుషార్ మెహతా సూచన మేరకు కేటీఆర్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చారు.

ఆ తర్వాత అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదు చేసి అప్పటి అధికారులు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డితో పాటు కేటీఆర్‌ను కూడా విడివిడిగా విచారించారు. ఏసీబీ కేసు ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా కేసు నమోదు చేసుకొని ఈ ముగ్గురినీ విచారించారు. ఈ విచారణలో ఏం తేలింది? కేటీఆర్‌ను కేసులో ఇరికించే ఆధారాలు లభించాయా? లేదా? అన్నది సస్పెన్స్‌గానే ఉంది. ప్రభుత్వం చెల్లించిన 55 కోట్లు తమకు అందాయని ఫార్ములా%-%ఈ కంపెనీ అంగీకరిస్తున్నందున ఇందులో అవినీతి జరిగిందని ఎలా చెబుతారు? అని తాను విచారణ అధికారులను ఎదురు ప్రశ్నించినట్టు కేటీఆర్ చెబుతున్నారు. గతంలో ఓటుకు నోటు కేసులో కేసీఆర్ సర్కార్ రేవంత్‌రెడ్డిని అరెస్టు చేయించి ఇబ్బందుల పాల్జేసింది. నాడు తనను వేధించినందుకు ప్రతీకారం తీర్చుకునే అవకాశం వచ్చినందున ఫార్ములా%-%ఈ రేసు కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేస్తారన్న అభిప్రాయం బలంగా వ్యాపించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ పెట్టుకున్న పిటిషన్‌ను హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టు కూడా కొట్టివేశాయి. ఈ పిటిషన్‌పై నిర్ణయం తీసుకునే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దని హైకోర్టు కొంత కాలంపాటు ఆయనకు రక్షణ కల్పించింది. దీంతో పిటిషన్లు డిస్మిస్ అయిన తర్వాత ఆయనను అరెస్టు చేస్తారని అందరూ భావించారు. ఇలాంటి కేసులలో నిందితులు వెంటనే హైకోర్టుకు వెళ్లి బెయిలు కోరే అవకాశం లేకుండా శుక్రవారంనాడు అరెస్టు చేయడం ప్రభుత్వాలకు అలవాటుగా మారింది. ఈ నేపథ్యంలో హైకోర్టుకు సంక్రాంతి సెలవులు ప్రారంభమైనప్పుడు కేటీఆర్‌ను అరెస్టు చేస్తారని భావించారు. సెలవులు ముగిశాయి. కేటీఆర్ ఈడీ విచారణకు కూడా వెళ్లి వచ్చారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో ఎప్పుడైనా కేటీఆర్‌ను అరెస్టు చేయవచ్చునని ప్రచారం జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఆయన లండన్ పర్యటనకు వెళ్లిన తర్వాత చంద్రబాబును అరెస్టు చేశారు. దీంతో సదరు అరెస్టుతో తనకు సంబంధం లేదని, చట్టం తన పని తాను చేసిందని, పోలీసులు చట్ట ప్రకారం చంద్రబాబును ఎత్తారని జగన్‌రెడ్డి అప్పుడు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దీంతో తెలంగాణలో ఈ సంఘటనను గుర్తుచేసుకొని ప్రస్తుతం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నందున కేటీఆర్‌ను కూడా రేపో మాపో అరెస్టు చేస్తారని ప్రచారం మొదలైంది. రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లి రెండు రోజులు దాటింది. దీంతో అసలు కేటీఆర్ అరెస్టు ఉంటుందా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ప్రభుత్వం కేటీఆర్‌ను అరెస్టు చేయిస్తే రాజకీయంగా తమకు లాభిస్తుందని భారత రాష్ట్ర సమితి నాయకులు మరోవైపు లెక్కలు వేసుకుంటున్నారు. కేటీఆర్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మనసులో ఏముందో తెలియడం లేదు. ఆయన గుంభనంగా ఉంటున్నారు. మంత్రులు మాత్రం జైలుకు వెళ్లడానికి కేటీఆర్ సిద్ధంగా ఉండాలని అడపాదడపా ప్రకటనలు చేస్తున్నారు. దీంతో మొత్తం వ్యవహారం ఇదిగో పులి అంటే అదిగో తోక అన్నట్టుగా తయారవుతోంది.

'క్విడ్ ప్రో కో'లో బలమెంత?

# కుంభమేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక: ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

కుంభమేళాకు పెద్ద సంఖ్యలో వస్తున్న యువతను అభినందించారు. దేశంలోని యువత తమ ఆచార సంప్రదాయాలను తెలుసుకున్నప్పుడే మన మూలాలు బలపడతాయన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రపంచ దేశాల నుంచి వస్తున్న ఆదరణ ప్రతి భారతీయుడికి గర్వకారణమని చెప్పారు.

మనసులో మాట పేరుతో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తారు. అయితే.. ఈ నెలలో చివరి ఆదివారం అయిన జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఉండడం వల్ల నేడు(మూడో ఆదివారం) మన్‌కీ బాత్ 118వ ఎపిసోడ్ ప్రసారం చేశారు. "ఈ రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకమైనది. ఈ సంవత్సరం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతుంది. మన పవిత్రమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన రాజ్యాంగ పరిషత్‌లోని గొప్ప వ్యక్తులందరికీ తలవంచి నమస్కరిస్తున్నాను" అని అన్నారు.

ఎన్నికల ప్రక్రియను ఈసీ పటిష్ఠం చేస్తోంది..

ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి, పటిష్ఠం చేస్తోందని ప్రధాని కొనియాడారు. ప్రజాశక్తిని బలోపేతం చేయడానికి సాంకేతికతను ఉపయోగిస్తూ.. నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తుందన్నారు.

యువత అంకుర సంస్థల వైపు ఆకర్షితులవుతున్నారని ప్రధాని పేర్కొన్నారు. దీంతో స్టార్టప్ ఇండియా రూపుదిద్దుకుంటోందని.. సమాజంలో పరిస్థితులు మారిపోతున్నాయని అన్నారు. దేశం డిజిటల్ యుగంలోకి ప్రవేశిస్తోందని.. దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని వెల్లడించారు. నేటి యువత తమ అభివృద్ధి గురించి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా కృషి చేస్తోందని వెల్లడించారు. దీపక్ నబం అనే వ్యక్తి తాను స్థాపించిన అంకుర సంస్థ ద్వారా నిరాశ్రయులకు సహాయం చేస్తున్నాడని ప్రశంసించారు.

# ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో అగ్ని ప్రమాదం

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో

ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ గుడారంలో రెండు గ్యాస్ సిలిండర్లు పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. అక్కడి నుంచి క్రమంగా మంటలు ఇతర గుడారాలకు వ్యాపించాయని తెలిపారు. మరోవైపు, దట్టమైన పొగ వ్యాపించడంతో భక్తులు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.



"మహా కుంభమేళాలోని సెక్టార్ 19 వద్ద గుడారంలో రెండు గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఆ మంటలు ఇతర గుడారాలకు వ్యాపించాయి. కుంభమేళా వద్ద భద్రతా ఏర్పాట్లలో భాగంగా అప్పటికే ఉంచిన అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశాయి. సమీపంలోని టెంట్లలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాం' అని పోలీసులు తెలిపారు.

"గీతాప్రెస్‌కు చెందిన టెంట్‌లలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. నష్టాన్ని అంచనా వేసేందుకు సర్వే జరుగుతోంది. మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదానికి కారణాలను తెలుసుకొనేందుకు దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. టెంట్లు, కొన్ని వస్తువులు మాత్రం దగ్ధమయ్యాయి" – మహా కుంభమేళా డీఐజీ వైభవ్ కృష్ణ

మరోవైపు, ఈ ఘటనపై మహా కుంభమేళా నిర్వాహకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అగ్నిప్రమాద ఘటన ప్రతి ఒక్కరినీ దిగ్భ్రాంతికి గురిచేసిందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టారని తెలిపారు. అందరూ సురక్షితంగా ఉండాలని గంగా మాతను ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

# డీఎంకేలో చేరిన సినీ నటుడు సత్యరాజ్ కుమార్తె

చెన్నై: సినీనటుడు సత్యరాజ్ కుమార్తె దివ్య సత్యరాజ్ డీఎంకే లో చేరారు. తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ సమక్షంలో ఆదివారం ఆమె డీఎంకే తీర్థం పుచ్చుకున్నారు. పోషకాహార నిపుణురాలైన దివ్య సత్యరాజ్ డీఎంకేలో చేరిన విషయాన్ని ఆ పార్టీ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఈ కార్యక్రమంలో డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, పార్టీ నేతల్లు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆమె స్టాలిన్‌ను కలిసిన సమయంలో డీఎంకేలో చేరుతున్నట్లు పెద్ద ఎత్తున ఊహాగానాలు వచ్చాయి. అయితే, అది మర్యాదపూర్వక భేటీయేనని, ఇరు కుటుంబాల మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు అప్పట్లో ఆమె వివరణ ఇచ్చారు.



తాజాగా డీఎంకేలో చేరిన సందర్భంగా దివ్య మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలనేది తన కల అన్నారు. చిన్ననాటి నుంచే డీఎంకే విధానాలను ఇష్టపడినట్లు చెప్పారు. ఆ పార్టీలో చేరడానికి అనేక కారణాలున్నాయన్న ఆమె.. తానొక పోషకాహార నిపుణురాలినని, డీఎంకే ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చే పార్టీ అన్నారు. అందుకే రాష్ట్రంలో అల్పాహార కార్యక్రమాన్ని సైతం ప్రారంభించిందని తెలిపారు. మహిళలను, అన్ని మతాలను గౌరవించే పార్టీ డీఎంకే అని పేర్కొన్నారు.

## నేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

నారాయణపేట జిల్లా జనవరి 19,



నేడు నారాయణపేట నియోజకవర్గం లో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి పర్యటించనున్నారు.ఉదయం 10:30 గంటలకు మరికల్ మండల కేంద్రంలో రాయిచూర్ రోడ్డు లో ఇందిరమ్మ ఇండ్లు పథకం లో భాగంగా మోడల్ హౌస్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం చేస్తారు.ఉదయం 11:15 గంటలకు నారాయణపేట పట్టణంలోని లిటిల్ స్టార్స్ హై స్కూల్లో జరిగే సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ప్రారంభోత్సవ,మధ్యాహ్నం 12:00 గంటలకు నారాయణపేట జిల్లా ఆస్పత్రి సందర్శన అనంతరం,మధ్యాహ్నం 01:30 గంటలకు నారాయణపేట మెడికల్ కాలేజీ సందర్శించి,మధ్యాహ్నం 02:00 గంటలకు ధన్వాడ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్లు పథకం లో భాగంగా మోడల్ హౌస్ నిర్మాణానికి భూమి పూజ చేస్తారు.మధ్యాహ్నం 02:30 గంటలకు ధన్వాడ మండల కేంద్రంలో డిగ్రీ కాలేజీ తాత్కాలిక భవనం ప్రారంభోత్సవ చేపట్టి అనంతరం మధ్యాహ్నం 03:00గంటలకు ధన్వాడ మండల కేంద్రంలో కేజీబీవీ స్కూల్ దగ్గర ఎమ్మెల్యే నిధులతో మంజూరు అయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన, సాయంత్రం 04:00 గంటలకు చిట్టెం వెంకటేశ్వర రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ధన్వాడ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ లో బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు.కావున ప్రజా ప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు, ప్రజలు,పాత్రికేయ మిత్రులు పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

# హరీశ్‌రావు విజ్ఞప్తి

మొదటి పేజీ తరువాయి

గతంలో రుణమాఫీ కాలేదని అదిలాబాద్ జిల్లా తలమడుగులో నిరసన తెలియజేస్తున్న రైతులను అరెస్టు చేసి, పోలీస్ యాక్ట్ (30 Act) పేరుతో జిల్లాలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దని పోలీసులు ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కారని విమర్శించారు. రుణమాఫీ జరగకపోవడంతో రైతులు కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ విసిగిపోతున్నారని అన్నారు. ఉన్న భూములు కుదవ పెట్టి అప్పులు తెస్తున్నారని.. ఆ అప్పులు చెల్లించలేక చివరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ అని మభ్య పెట్టి.. 500 బోనస్ అని మోసం చేసి.. పెట్టుబడి సాయన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ దురవస్థ వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు.

24 గంటలు గడవకముందే రుణభారంతో ఆదిలాబాద్‌లో మరో రైతు రాథోడ్ గోకుల్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచివేసింది.

రుణమాఫీ పూర్తి చేశామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, బ్యాంకుల వేధింపులతో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల చావులు కనిపించడం లేదా?

ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడలేదన్న విషయం, కాంగ్రెస్ పాలకులు పూర్తిగా మరిచిపోయినట్లున్నారని హరీశ్‌రావు అన్నారు. రైతు సోదరులారా దయచేసి ఆత్మహత్యలు చేసుకోకండి అని విజ్ఞప్తి చేశారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదని.. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా అందరికీ రుణమాఫీ, రైతు భరోసా, అన్ని పంటలకు 500 బోనస్ హామీలు అమలు చేసే దాకా నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

## పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నాం.. కానీ..: ఎమ్మెల్సీ కవిత

మొదటి పేజీ తరువాయి

నిజంగా రైతుల కోసమే ఈ నిర్ణయమైతే పసుపు మద్దతు ధర ప్రకటించాలి. ప్రతి విషయాన్నీ ప్రజలు గమనిస్తున్నారు. పసుపు బోర్డు కోసం భారాసనే పోరాటం ప్రారంభించింది. నేను ఎంపీగా ఉన్నప్పుడు దీని కోసం కృషిచేశాను. పసుపు ఆధారిత పరిశ్రమలు తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాం. నిజామాబాద్‌కు విమానాశ్రయం తీసుకురావాల్సిన బాధ్యత ఎంపీ అర్వింద్‌పై ఉంది" అని కవిత అన్నారు.


# రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు..

మొదటి పేజీ తరువాయి

రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వాక్ స్వాతంత్ర్య పరిమితులను దాటాయని, అవి జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగిస్తాయని చాటియా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు అశాంతితో పాటు, వేర్పాటువాద భావాలు కలిగిన వారిని రెచ్చగొట్టే ప్రమాదం ఉందన్నారు. 'ప్రతిపక్ష నాయకుడిగా.. ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత రాహుల్ కు ఉంది. కానీ, ఆయన అందుకు బదులుగా అబద్ధాలు వ్యాప్తి చేసి దేశ ఐక్యతను, సార్వభౌమత్వాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు' అని చాటియా ఆరోపించారు.

దిల్లీలో కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యాలయాన్ని ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'ఆరెస్సెస్ వంటి మా భావజాలం వేల సంవత్సరాల నాటిది. భాజపా , ఆరెస్సెస్ దేశంలోని ప్రతి సంస్థను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయి. మేము ఇప్పుడు భాజపా, ఆరెస్సెస్‌తోపాటు భారత దేశంపై కూడా పోరాడుతున్నాం' అని వ్యాఖ్యానించారు. ఈవ్యాఖ్యలను పలువురు కేంద్ర మంత్రులు తప్పుబట్టారు. కాంగ్రెస్ అసలురూపం ఈ వ్యాఖ్యలతో బయటపడిందని భాజపా జాతీయాధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా వ్యాఖ్యానించారు.

## జనవరి 21, 27తేదీల్లో యూజీసీ నెట్ పరీక్ష.. అడ్మిట్ కార్డులు విడుదల



ఇంటర్నెట్ డెస్క్: యూజీసీ -నెట్ డిసెంబర్ 2024 పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులు విడుదలయ్యాయి. మొత్తం 85 సబ్జెక్టులకు జనవరి 3 నుంచి 16 వరకు ఆన్‌లైన్‌లో (సీబీటీ) ఈ పరీక్షలు పూర్తి కావాల్సి ఉండగా.. పండుగ నేపథ్యంలో జనవరి 15న జరగాల్సిన పరీక్షను జనవరి 21, 27 తేదీలకు రీషెడ్యూల్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆ రెండు రోజుల్లో జరగనున్న పరీక్షల అడ్మిట్ కార్డులను ఎన్టీఏ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీ, సెక్యూరిటీ పిన్ ఎంటర్ చేసి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.అడ్మిట్ కార్డులపై అభ్యర్థి ఫొటో, బార్‌కోడ్, క్యూఆర్ కోడ్‌ను చెక్ చేసుకోవాలని యూజీసీ సూచించింది. వీటిలో ఏది లేకపోయినా మరోసారి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అభ్యర్థులు 011-40759000 నంబర్ లేదా ugcnet@nta.ac.in ద్వారా సంప్రదించవచ్చు. జూనియర్ రీసెర్చి ఫెలోషిప్, విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీపడేందుకు ఉపయోగపడే ఈ పరీక్ష కోసం డిసెంబర్ 11వరకు దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే.

## సైఫ్ అలీఖాన్ పై దాడి చేసిన దుండగుడు దొరికాడు

# సి సి టివి ఫుటేజ్ లే కీలక ఆధారాలు

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

జనవరి 16 వ తేదీ గురువారం తెల్లవారుజామున పలుమార్లు కత్తిపోట్లకు గురైన సైఫ్ అలీ ఖాన్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ముంబై బాంద్రా వెస్ట్ ప్రాంతంలోని 'సద్గురు శరణ్' భవనంలోని తన 12వ అంతస్తు అపార్ట్?మెంట్?లో ఈ ఘటన చోటుచేసుకుంది.గురువారం తెల్లవారుజామున సైఫ్ అలీ ఖాన్ కుమరుడు, పనిమనిషిపై ఓ దుండగుడు కత్తితో దాడి చేయబోయాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన సైఫ్?పై దాడి జరగడంతో ఘర్షణ జరిగింది. చివరికి సైఫ్? అలీ ఖాన్? కత్తిపోట్లకు గురయ్యారు.వెన్నెముకకు కత్తిపోట్లు సహా తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం ముంబైలోని లీలావతి ఆసుపత్రికి సైఫ్?ని తరలించారు.సైఫ్ వెన్నెముకలో కత్తిపోటు కారణంగా థొరాసిక్ వెన్నెముకకు తీవ్ర గాయమైందని వైద్యులు తెలిపారు.సైఫ్ అలీ ఖాన్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఐసీయూ నుంచి సాధారణ గదికి తరలించామని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.2.5 ఇంచ్ పొడవైన బ్లేడ్ ని తొలగించే శస్త్రచికిత్స విజయవంతమైంది.సైఫ్ ప్రస్తుతం ప్రమాదం నుంచి బయటపడినప్పటికీ, వైద్య సిబ్బంది ఆయన పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తూనే



సైఫ్ అలీఖాన్ పై దాడిచేసిన దుండగుడు బంగ్లాదేశీయుడు ముహమ్మద్ షరీఫుల్ ఇస్లాం షహజాద్ (30)

ఉన్నారు.ఐసీయూ నుంచి తరలించిన ఈ బాలీవుడ్ నటుడు నడవగలుగుతున్నాడని, సాధారణ ఆహారం తీసుకుంటున్నారని వైద్యులు తెలిపారు. సోమవారం నాటికి సైఫ్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంది.

### నిందితుడు ఎవరు?

సైఫ్ అలీ ఖాన్ పై దాడి చేసిన వ్యక్తి అసలు పేరు మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్ అని పోలీసులు వెల్లడించారు. ఈ దుండగుడు బంగ్లాదేశీయుడు.బంగ్లాదేశ్ నుంచి భారత్ లోకి ప్రవేశించిన తర్వాత తన పేరును విజయ్ దాస్ గా మార్చుకున్నాడని పోలీసులు తెలిపారు.మహ్మద్ షెహజాద్ వయస్సు 30 ఏళ్లని, దొంగతనం చేయాలనే ఉద్దేశంతోనే నటుడు సైఫ్ అలీఖాన్ ఇంట్లోకి ప్రవేశించాడని జోన్ 9 డీసీపీ దీక్షిత్ గెడం మీడియా సమావేశంలో తెలిపారు.బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా ప్రవేశించిన తర్వాత విజయ్ దాస్ అనే హిందూ పేరును వాడుకుంటున్నాడు.ఐదారు నెలల క్రితం ముంబైకి వచ్చాడు. కొన్ని రోజులు ముంబైలో, ఆ తర్వాత ముంబై పరిసర ప్రాంతాల్లో బస చేశాడు. నిందితుడు హౌస్ కీపింగ్ ఏజెన్సీలో సైతం పనిచేశాడు అని గెడం తెలిపారు.నిందితుడిని కోర్టులో హాజరుపరిచి కస్టడీకి కోరుతామని గెడం వెల్లడించారు. నిందితుడి వద్ద సరైన భారతీయ పత్రాలు లేవని, కాగా అతను బంగ్లాదేశీయుడని చెప్పడానికి ప్రాథమిక ఆధారాలు లభించాయని ఆయన తెలిపారు.నిందితుడు విజయ్ దాస్, బిజోయ్ దాస్ వంటి ఇతర మారుపేర్లను ఉపయోగించాడని తెలిపారు.

### ఆటో డ్రైవర్ ఔదార్యం.

గురువారం తెల్లవారుజాము సమయంలో తాను ఆటోలో వెళ్తుండగా, తనకు ఆటో ఆటో అంటూ కేకలు ఓ మహిళ కేకలు వినిపించాయని, రోడ్డుకు అటువైపు నుంచి ఆ కేకలు రావడంతో యూ టర్న్ తీసుకుని ఆ భవనం వైపు వెళ్లానని ఆటో డ్రైవర్ భజన్ సింగ్ రాణా తెలిపాడు.అయితే, సైఫ్ అలీఖాన్ గేటు వద్దే నా ఆటో ఎక్కాడు. త్వరగా ఆసుపత్రికి తీసుకువెళ్లాలని కోరాడు. అతడిలో ఎలాంటి భయం కనిపించలేదు. అతడితో పాటు ఒక చిన్న పిల్లవాడు కూడా ఆటో ఎక్కాడు.వారిని 10 నిమిషాల్లోపే ఆసుపత్రికి తీసుకువెళ్లాను. ఆ సమయంలో సైఫ్ అలీఖాన్ తెల్లని కుర్తా రక్తంతో తడిచి ఎర్రగా మారింది. అతడి మెడ భాగం నుంచి తీవ్రంగా రక్తస్రావం అవుతోంది. ఆసుపత్రికి చేరుకున్న తరువాత తానే దిగి లోపలికి నడిచి వెళ్లాడు. ప్రశాంతంగా ఆటోలోంచి దిగాడు అని డ్రైవర్ భజన్ సింగ్ రాణా వివరించాడు.

**వారి నుంచి తాను డబ్బులు తీసుకోలేదన్నాడు.**

### సిసి టివి లే కీలక ఆధారం

ఈ కేసు పరిశోధనలో ఒక ముఖ్య సిసి టివి ఫుటేజ్ లు కీలకంగా ఉపయోగపడ్డాయి.ఈ కేసు లో ముంబై పోలీసులు 4 టీంలుగా ఏర్పడి చేసిన విచారణలో సిసి టివి లే కీలక ఆధారంగా ఉపయోగపడ్డాయి.దాదర్ లోని ఒక మొబైల్ షాప్ లో ఈ దుండగుడు సెల్ ఫోన్ కవర్ కొనుక్కొని యూపీఐ పేమెంట్ చేసి నడుచుకుంటూ పోయిన సిసి టివి ఫుటేజ్ సంపాదించిన పోలీసులు ఈ దుండగుడిని నీడలా వెంటాడి థానే లోని హీరానందాని ఎస్టేట్ లో అదుపులోనికి తీసుకున్నారు.

### సిసి టివి లు పెట్టుకోండి

నేరస్థులు తెలివిమీరి ప్రవర్తిస్తున్నారు. నేరాల అదుపుకు సిసి టివి లు చాలా ఉపయోగపడతాయి. కాబట్టి ప్రతి ఒక్కరు తమ తమ స్థలాల్లో సిసి టివిలు పెట్టుకోవాలని పోలీసులు కోరుతున్నారు.

### రోహింగ్యాలు, బంగ్లాలపట్ల జాగ్రత్త

బంగ్లాదేశ్ చొరబాటుదారులు ప్రమాదకరంగా మారారు. పాకిస్తాన్,బంగ్లాదేశ్,రోహింగ్యా చొరబాటుదారులను భారత్ నుండి పంపించివేయాలని ఈ సంఘటన తెలియజేస్తున్నది.భారత ప్రభుత్వం ఈ అక్రమ చొరబాటు దారుల పట్ల తీసుకుంటున్న చర్యలు ఎంత ఆవశ్యకమో అందరూ గుర్తించాలి.

### ఈ దేశం ధర్మ సత్రం కాదు.

మత వ్యాప్తికి, విస్తరణ వాదానికి ఈ చొరబాటు దారులకు వత్తాసు పలికే వారు ఖచ్చితంగా దేశ ద్రోహులు అవుతారని విజ్ఞులు మరొక్కసారి గుర్తుచేస్తున్నారు..అక్రమ చొరబాటుదారులను ప్రోత్సహించడం మానవతా వాదం కాదు. దీన్ని సూడో సెక్యులరిజం అంటారు.మానవత్వం ఉన్న ఏ దేశం కూడా తమ పౌరులను దేశం దాటించదు.ఉదారవాదం పేరుతో దేశాన్ని అల్లకల్లోలం చేయాలనుకుంటున్న వారిని గుర్తించి ఈ కుట్రలను నిర్వీర్యం చేయాల్సిన బాధ్యత పౌరులందరిదీ.

# బీసీల అభ్యున్నతికి కృషి

**ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి**

బీసీల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలంగాణ బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వృక్ష శాస్త్రం ఉపన్యాసకులు మామిడి విట్టల్ అన్నారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆదివారం రోజున ఆయన జిల్లా పర్యటనలో భాగంగా సందర్శించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , బీసీలలో రిజర్వేషన్లు లేక విద్యార్థులు అన్ని రంగాలలో వెనుకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు..బీసీ సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు . విద్య,వైద్య, ఉపాధి,,రాజకీయ రంగాలలో బీసీలు ముందుండాలని విఠల్



పిలుపునిచ్చారు..అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మరియు బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ కే.వేంకయ్య మాట్లాడుతూ , బీసీలు అన్ని రంగాలలో రాణించటానికి న్యాయ బద్ధంగా తెలంగాణ రాష్ట్ర కమిటీ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీసీలు రాజకీయంగా ఎదిగినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని, అప్పుడే బీసీలకు అధికారం లభిస్తుందని ప్రిన్సిపాల్ అన్నారు.ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ను ఆవిష్కరించడంతో పాటు కళాశాలకు మొట్టమొదటిసారిగా విచ్చేసిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది సంయుక్తంగా మామిడి విఠల్ ను శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 19**

గత 37 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాలలో కలుసుకొని తన మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. జమ్మికుంట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88 బ్యాచ్ కి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాలు వృత్తులలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని తమ మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు తమ బాల్య మిత్రులను, ఉపాధ్యాయులను కలుసుకోవడంతో చిన్ననాటి వింతలు విశేషాలు ఆడిన ఆటలు పాడిన పాటలు చిలిపి చేష్టలు నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులతో ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పి పాఠాలు బోధించి మార్గ దర్శకులుగా నిలిచిన ఆనాటి గురువులు రామనాథ%శ%, విఠల్ రావు, సత్తయ్య, బొందయ్య, బషీరోద్దీన్ గురువులను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్లగొండ సదానందం లను ఆహ్వానించి కాలువాలతో ఘనంగా సత్కరించారు.పూర్వ విద్యార్థులు ప్రస్తుతం పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 250 మంది విద్యార్థులకు ప్లేట్లు బహూకరించారు.ఈ కార్యక్రమంలో గురువులు పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శనగర్ అసోసియేషన్ ఎన్నికలు




**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

కోరుట్ల ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ 2025-2027 ఎన్నికలలో ముత్యాల గంగాధర్ అధ్యక్షునిగా, ఉప్పులూటి రాఘవులు ప్రధాన కార్యదర్శిగా, చెన్న శ్రీనివాస్ కుమార్ ఆర్థిక కార్యదర్శిగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు రాంప్రసాద్, మహేష్, సతీష్ గౌడ్, రాకేష్, జగ్గయ్య, రామకృష్ణ శాస్త్రి లు తెలిపారు. అధ్యక్షులు గంగాధర్ మాట్లాడుతూ రాజకీయ నాయకులు, అధికారులు, కాలనీవాసులు అందరితో కలిసి కాలనీ అభివృద్ధికి పాటుపడతామని , ఆదర్శనగర్ కాలనీ లోని సమస్యలను రెండు సంవత్సరాల పదవి కాలంలో తీర్చే విధంగా ప్రణాళికలు తయారు చేసుకుంటామని, త్వరలో పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు సిబ్బందిని ఆదర్శనగర్ గౌరవ అధ్యక్షులు బూర్గు రామస్వామి, మాజీ అధ్యక్షులు కిరణ్, కార్యదర్శి వెంకటరమణ తదితర కాలనీ వాసులు అభినందించారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**



అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని 30వ వార్డ్ కాంగ్రెస్ ఇంచార్జీ ఎంబేరి సత్యనారాయణ అన్నారు. కోరుట్ల నియోజకవర్గం పార్టీ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు , జువ్వాడి కృష్ణారావు ఆదేశాల మేరకు నూతన రేషన్ కార్డుల సర్వే శుక్రవారం చేపట్టారు. ఎంబేరి సత్యనారాయణ పాల్గొనడం జరిగింది.నర్సింగరావు సహకారంతో అర్హులందరికీ ఖచ్చితంగా రేషన్ కార్డులు మంజూరు చెపిస్తామన్నారు. మాది ప్రభుత్వం. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలు అమలు చేస్తుంది.కాంగ్రెస్ విధానాలు పథకాల పట్ల వార్డ్ ప్రజలు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారని సత్యనారాయణ అన్నారు.

# రాములోరి సన్నిధిలో నూతన వాసవి క్లబ్ కమిటీ ఎన్నిక.

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట జనవరి 19**

అపర భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీ ఇల్లంతకుంట సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆలయ ప్రాంగణంలో వాసవి క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించినట్లు వాసవి క్లబ్ రీజనల్ చైర్మన్ అయిత రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిరుపేదలకు సేవలు అందించడంలో వాసవి క్లబ్ ఎప్పుడు ముందు ఉంటుందని ఆమె అన్నారు. ఇల్లంతకుంట మండలం వాసవి క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. వాసవి క్లబ్ ఇల్లంతకుంట మండల అధ్యక్షుడిగా వంగల ప్రవీణ్ కుమార్ ప్రధాన కార్యదర్శిగా గుండా శ్రీనివాస్ కోశాధికారిగా కండెం వేణు చేత జిల్లా గవర్నర్ ఇల్లందుల కిషోర్ ప్రమాణ స్వీకారోత్సవం చేయించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెర్సీ నగునూరి శైలజ జిల్లా క్యాబినెట్ సెక్రటరీ ఉందా కేదారి మాట్లాడుతూ, ఇల్లంతకుంట మండల వాసవి క్లబ్ నూతన కమిటీకి వారు ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతూ, రాబోయే రోజుల్లో వాసవి క్లబ్ ద్వారా నిరుపేదలకు విశిష్ట సేవలు అందించాలని సూచించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మాపై నమ్మకంతో మాకు ఈ అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని భవిష్యత్తులో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మెరుగైన సేవలు అందిస్తూ ముందుకు కొనసాగుతామని తెలిపారు. అదేవిధంగా మరికొంతమందిని సభ్యులుగా చేర్చుకుంటామని వాసవి క్లబ్ తో పాటు వాసవి వనితా క్లబ్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని త్వరలోనే మరో వాసవి క్లబ్ ఏర్పాటు చేసి మండలంలో విస్తృత సేవలు అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వాసవి క్లబ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సిరిపూర్ గోసంగిసంఘం కు పండ్ల పంపిణీ.

## .. టిడిపి కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ మానుక ప్రవీణ్ కుమార్.




**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, జనవరి 19.**
జగిత్యాల జిల్లామెట్పల్లి డివిజన్ లోని మల్లాపూర్ మండలంలోని సిరిపూర్ గోసంగి సంఘం వారికి ఆదివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మానక ప్రవీణ్ కుమార్ పండ్లు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ ముఖ్యమంత్రి చేసిన పాలను కొనియాడారు .నందమూరి తారకరామారావు కేంద్ర ప్రభుత్వము వెంటనే భారతరత్న బిరుదు వెంటనే ప్రకటించాలని కోరుట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ డిమాండ్.టిడిపి పార్టీ ఆవిర్భావ దాత, నేత తెలుగు చలన చిత్రంలో చరిత్ర సృష్టించిన నటుడు, ఎన్టీఆర్ అని , ఎన్నో పాత్రలు నటించి తెలుగు జాతికే వన్నెతెచ్చిన నటరత్న, నట ప్రపూర్ణ , పద్మశ్రీ తీసుకున్న వ్యక్తి. రాజకీయ రంగంలో 9 నెలలు చరిత్ర సృష్టించి, అధికారంలోకి వచ్చి ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ముఖ్యంగా నిరుపేదలకు రెండు రూపాయల కిలో బియ్యం ,జనతా వస్త్రాలు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, రాజకీయ రంగంలో మహిళలకు రిజర్వేషన్ మండలిక వ్యవస్థ పటేల్ పట్వారి వ్యవస్థ రద్దు, పక్క గృహ నిర్మాణ పథకము, బడుగు బలహీన వర్గాలు రాజకీయాలలో రిజర్వేషన్, తెలుగు గంగా పథకము ఇలాంటి ఎన్నో ప్రజా సంక్షేమ సంక్షేమ పథకాలు చేపట్టారని తెలిపారు.ఇటు రాజకీయంలో అటు చలనచిత్ర పరిశ్రమలలో ప్రపంచ రికార్డు చేపట్టి ప్రపంచంలో పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్న వ్యక్తి అని ఈ సందర్భంగా అన్నారు. కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ చైర్మన్ గా రికార్డు బద్దలు చేపట్టిన వ్యక్తి అని, ఆయన వచ్చిన తర్వాతనే తెలుగు ప్రజలకు రాజకీయ అవగాహన వచ్చిందనితెలియజేశారు.ఇలాంటి మహోన్నత వ్యక్తికి భారతరత్న బిరుదును వెంటనే ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో చందు, ఎం డి సాదుల్లా, గజేల్లి రాజాగణేస్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, గోసే సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్ హై స్కూల్ లో మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన




**కరపత్రం న్యూస్ గన్నేరువరం,జనవరి19**

మండల కేంద్రంలోని విజ్ఞాన్ హై స్కూల్ లో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో సురక్ష హాస్పిటల్ కరీంనగర్ నుండి ఆర్థోపెడిక్, సర్జన్, ప్రొఫెసర్ డా..చొక్కారపు రాము. కీళ్ళనొప్పులు ,నడుం నొప్పులు, మెడనొప్పులు . కీళ్ళవాతం. తొంటినొప్పులు పోలియో , ఫ్రాక్చర్లు , వంకరకాళ్ళు .సయాటికా . స్పాండిలైటిస్ , వంటి సమస్యలకు వైద్యపరీక్షలు నిర్వహించి సుమారు 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు.ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ హై స్కూల్ కరస్పాండెంట్ బూర వెంకటేశ్వర్, ప్రిన్సిపాల్ బూర భాను చైతన్య, సురక్ష హాస్పిటల్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


# జన్మభూమి ఋణము తీర్చుకుంటున్న గండ్ర విద్యాధరరావు




**కరపత్రం జనవరి 19**
మల్లాపూర్ మండలం సాతారం గ్రామానికి చెందిన ఎన్నారై గండ్ర విద్యాధరరావు పుట్టిన గ్రామము నడక నేర్పిన పల్లె ఊతమిచ్చిన గ్రామస్తులను మరవకుండా భవిష్యత్తులో మరో తరం కోసము ఎదురుచూస్తున్న విద్యార్థులకు తన సొంత గ్రామమైన సాతరంలోని ప్రభుత్వ పాఠశాలకు తన వంతు సహాయంగా రూపాయలు రెండు లక్షలతో వి ఎస్ జి ఫౌండేషన్ ద్వారా సొంత గ్రామంలో సందర్శించి విద్యార్థులకు అవసరమైన పాఠశాల టాయిలెట్స్ ని నిర్మించారు అలాగే ప్రాథమిక స్థాయి విద్యార్థుల వ్యక్తిగత కేలండలను ఆవిష్కరించారు మరియు పదవ తరగతి పరీక్షల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు పదివేల రూపాయల నగదు సహాయం అందించారు అనంతరం గ్రామస్తులతో కలిసి గ్రామ సమస్యలపై చర్చించి తగు సలహాలు అవసరమైన తోడ్పాటును అందిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు గ్రామంలోని సామాజిక సేవకులు పాల్గొన్నారు

# మార్కెట్ చైర్మన్ ను పరామర్శించిన గౌడ సంఘం నాయకులు

**కరపత్రం ధర్మారం జనవరి 19 :**
ధర్మారం మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్ తండ్రి మాజీ ఉప సర్పంచ్ లావుడ్య రత్తా నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం రోజున మార్కెట్ చైర్మన్ స్వగ్రామం లంబడి తండా (బి)గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి లింగయ్య



గౌడ్,నాగుల రాజేశం గౌడ్,నాయకులు తోడేటి మురళి గౌడ్,బాలసాని చంద్రమౌళి గౌడ్,కొత్తూరు గ్రామానికి చెందిన రాజేందర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్ల నాయక్ మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# జగ్గాసాగర్ లోరేనె హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా క్యాంప్.

**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, జనవరి 19.**




జగిత్యాలజిల్లా మెట్టుపల్లిమండలంలోని ఆదివారం జగ్గాసాగర్ గ్రామం లో రెనె హాస్పిటల్ డాక్టర్ బంగారి స్వామి ఆధ్వర్యంలో ఉచిత మెగా క్యాంపు నిర్వహించడం జరిగిందని మాజీ ఎంపీటీసీ జగన్ గౌడ్ తెలిపారు. ఈ క్యాంపుకు సుమారు 300 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేయడం జరిగిందాని జగన్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ లు జగన్ గౌడ్, భోగ గంగాధర్, గ్రామ అభివృద్ధి కమిటీ, డాక్టర్ అజయ్ కృష్ణ, మార్కెటింగ్ మేనేజర్ అభిలాష్ రెడ్డి, మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ లు సోమిడీ రామక్రిష్ణ, నూతిపెల్లి వెంకటేష్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడలు స్నేహాభావాల్ని పెంపొందిస్తాయి.



## ...సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వరావు .

**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, జనవరి 19.**
క్రీడలు స్నేహభావాన్ని పెంపొందింప చేస్తాయని సీనియర్ సివిల్ జడ్జి డి నాగేశ్వరరావు అన్నారు.ఘనతంత్ర దినోత్సవం సందర్భంగా మెట్ పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ పోటీల్ని నిర్వహించారు. క్రికెట్ పోట్లను సీనియర్ సివిల్ జడ్జ్, శ్రీ డి నాగేశ్వరరావు జూనియర్ సివిల్ జడ్జ్ అరుణ్ కుమార్ క్రికెట్ పోటీలను.ప్రారంభించినారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీ నాగేశ్వరరావు మాట్లాడుతూ న్యాయవాదులు,న్యాయమూర్తులు క్రీడలు ఆడటం పట్ల మానసికంగా ఉత్సాహంగా కొనసాగుతారని , గెలుపు ఓటములు స్పోర్ట్స్ స్పిరిట్ గా తీసుకొని క్రీడాకారులు ఆడాలని కోరారు. న్యాయవాదులు ప్రాక్టీస్ లో బిజీగా ఉండటం వల్ల క్రీడలు ఆడటంతో మానసికంగా ఉల్లాసంగా ఉంటారని తెలిపారు , బార్ ప్రెసిడెంట్ న్యాయమూర్తుల జట్ల మధ్య పోటీ జరుగగా ఫైనల్ మ్యాచ్ లో బార్ ప్రెసిడెంట్ జట్టు విజయం సాధించింది. ఈ పోటిల్లో జూనియర్ సివిల్ జడ్జ్ నారం అరుణ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, ఉపాధ్యక్షుడు ఎలుముల రాంబాబు, ప్రధాన కార్యదర్శి తునికి వేణుగోపాల్ ,ఉజ్జల శ్రీనివాస్ ,సిహెచ్ ఆనంద్ గౌడ్, వెంకట నరసయ్య, వద్దేపల్లి శ్రీనివాస్, పసునూరి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, తుల రాజేందర్, శంకర్ రెడ్డి,, జేడి సుధాకర్, తేలు ప్రతాప్,,మహేష్, గంగాధర్, రాజశేఖర్, పురుషోత్తం ,శంకర్ లతోపాటు బార్ అసోసియేషన్ క్రీడాకారులు సభ్యులు పాల్గొన్నారు

# మెట్పల్లి గోసంగి సంఘ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పరశురాం.

**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, జనవరి 19.**



జగిత్యాల జిల్లా ఆదివారం మెట్పల్లి గోసంగి కుల సంఘం నూతన అధ్యక్షులుగా మామిడిపల్లి పర్శురాం ఎన్నికైనారు. ఎన్నిక అనంతరం ఎన్నికైన సంఘ నూతన అధ్యక్షుడు మామిడిపల్లి పరశు రాముడు ఘనంగా శాలువతో సన్మానం చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తనని ఏకగ్రీవం చేసిన సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జన్నారపు కనకయ్య, మొగిలిపాక రామస్వామి, మొండిడ్ల మొగిలి, మొగిలిపాక రాజయ్య ,నిషాని బాలరాజు, ఎలుకటూరి రామచంద్రం, మామిడిపల్లి హనుమంతు, మొగిలిపాక అరుణ్, నిషాని సత్యనారాయణ, గోదా కిషన్, అంకమల్ల కొమురయ్య, మున్నిగడప నరహరి, సిర రాజు, నిశాన్ని పరశురాం, గజ్జి రాములు, మొగిలిపాక హరికృష్ణ, నిషంపల్లి కాశయ్య, రొడ్డ కనకయ్య, మెట్టుపల్లి గోసంగి కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీ కనక సోమేశ్వరుడి చెంతకు 108 మహత్తర ఉసిరి వృక్షాభరణాలు



**కరపత్రం జనవరి 19**
మల్లాపూర్ మండల కేంద్రంలో గల ఎంతో ప్రాచీనమైన భక్తుల పాలిట కొంగుబంగారమైన సాక్షాత్ పరమశివుడి రూపమైన శ్రీ కనక సోమేశ్వర స్వామి ఏకశిలా పర్వతం చెంతకు మరియు వారి సన్నిధిలో ఎంతో మహిమాన్వితమైన ఏకబిల్వా బహు బిల్వా ఉసిరికా సంపంగి మహా బిల్వ వృక్షాల మొక్కలు 108 మొక్కలు తెలంగాణ బ్రాహ్మణ సమితి అధ్యక్షులు సంగంపల్లి సుధాకర్ శర్మ కరకమలంతో బహుకరించబడ్డ ఈ వృక్ష మొక్కలను స్థానిక పురోహితులు బల్యపల్లి సుధాకర్ శర్మ తారా దేవి దంపతుల సంకల్పముతో వారి సోదరుడు అయినా బల్యపెల్లి ప్రభాకర్ శర్మ మహా పురోహితుల మంత్రోచ్ఛరణల మధ్య కనుక సోమేశ్వర స్వామి దీక్షాపరుల చేత ఈ వృక్ష మొక్కలను స్వామి వారి సన్నిధిలో నాటబడినవి ఇట్టి కార్యక్రమంలో మల్లాపూర్ దేవాదాయ కమిటీ అధ్యక్షులు సంఘ గంగా రాజము తో పాటు శివరామ కిషన్ బండారి రమేష్ స్వామి గోపిడి రమేష్ స్వామి సూర దివాకర్ స్వామి కైరా నాగేశ్ స్వామి శివ స్వాములు ఈ మహత్తర కార్యక్రమంలో పాల్గొన్నారు

# మానేరు పై బ్రిడ్జి నిర్మిస్తే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దవచ్చు.... మానేరు బ్రిడ్జి సాధన జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్...



**కరపత్రం న్యూస్ గన్నేరువరం:జనవరి 19**
మండలంలోని మైలారం మైసమ్మ గుట్ట ప్రాంతంలో మానేరు నదిపై కరీంనగర్ కు బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లయితే ఆ ప్రాంతంలో ఉన్న వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమితో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దవచ్చు అని మానేరు బ్రిడ్జి సాధనా సమితి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో వివిధ పార్టీల నాయకులతో కలిసి అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నే బ్రిడ్జి నిర్మాణం చేపట్టి మూడు మండలాల ప్రజలకు సౌకర్యం కల్పించాలని సూచించారు. అఖిలపక్ష నాయకులు తీర్మానం చేసి న పత్రాన్నిఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కు అందజేసి బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని కోరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు భామండ్ల రవీందర్, గంప వెంకన్న, తిప్పర్తి నికేష్, కాంతాల అంజిరెడ్డి, గువ్వ వీరయ్య, పురం శెట్టి బాలయ్య, మర్రి వెంకట మల్లు తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు తస్మాత్ జాగ్రత్త ప్రమాదం పొంచి ఉన్నది

**కరపత్రం జనవరి 19**
మల్లాపూర్ మండల కేంద్రంలో అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి చుట్టుపక్క గ్రామాల నుండి అలాగే మల్లాపూర్ మండల కేంద్రంలో నంది చౌరస్తాలో మెట్టుపల్లి వైపు నుండి గొర్రె పెల్లి వివి రావుపేట్ వరకు వెళ్లే వాహనదారులు నంది చౌరస్తా వద్ద ఉన్న మూలమలుపు ఆ మలుపును కమ్మేసిన చెట్లు ఎదురెదురుగా వస్తున్న వాహనాలకు అడ్డుగా మారాయి ఇప్పటివరకు ఎలాంటి ప్రమాదాలు జరగకపోగా భవిష్యత్తులో ఈ మూల మలుపు చెట్ల ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నది ఇప్పటికైనా అధికారులు స్పందించి లేదా అక్కడి భూ యజమానులు స్పందించి ఆ



చెట్లను తొలగించేస్తే మెట్టుపల్లి వైపు నుండి వచ్చే వాహనాలు అలాగే గొర్రె పెల్లి వైపు నుండి వచ్చే వాహనాలు ఎదురు ఎదురుగా కనబడే అవకాశం ఉండి ప్రమాదాలు జరగకుండా తప్పించుకునే అవకాశం ఉంటుంది అలాగే మూల మలువుపైనే విద్యుత్ స్తంభం ఉన్నందున చెట్ల చాటున విద్యుత్ స్తంభం కనబడక ప్రమాదాలు జరిగే అవకాశం మెండుగా ఉన్నవి దీనిపై విద్యుత్ అధికారులు గానీ ఇప్పటికైనా స్పందించాలి మల్లాపూర్ మండల అధికారులు గానీ ఆ ప్రాంతంలో అడ్డుగా ఉన్న చెట్ల భూ యజమానులు గాని స్పందించి వాటిని తొలగించే ప్రయత్నం చేయగలరని మల్లాపూర్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు